క్లుప్తంగా

ధరణి దరఖాస్తుల పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు శనివారం తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొత్తం 357 ధరణి దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 142 దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా క్షుణ్ణంగా పరిశీలన చేసి వాటిని పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో శనివారం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఐజీ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందించారు. గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి రమేష్‌రెడ్డి ఐజీగా పదోన్నతి పొందిన తరువాత గ్రామానికి మొదటి సారిగా రావడంతో గ్రామస్థులు ఐజీ దంపతులకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటపోటీలను నిర్వహించి విజేతలకు ఐజీ దంపతులచే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కవితారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



చిన్నంబావి: డ్వాక్రా మహిళా సంఘ సభ్యులకు పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందించడంపై జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు మహిళలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఇందిర, చంద్రశేఖర్‌యాదవ్, సుధాకర్, గౌతమి పాల్గొన్నారు

శ్మశానవాటికకు హద్దులు చూపించాలి



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో తూముకుంట రోడ్డు వైపు ఉన్న బీసీల స్మశానవాటికకు హద్దులు నిర్ధారించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. బీసీ స్మశానవాటికకు స్థలం లేవపోవడంతో ఏర్పడుతున్న సమస్యల గురించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లామని, రెవెన్యూ అధికారుల ద్వారా స్మశానవాటిక స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయించుకోవాలని మంత్రి సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కావలి మహేష్, బాల పీర్, మదుగని శివ, గంగులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై మహిళలకు అవగాహన



అమరచింత: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా బ్యాక్టీరియాలు శరీరంలోకి చేరకుండా కాపాడుకునే అవకాశం ఉందని సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్ నర్మద అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించి ఆయా కాలనీల్లోని మహిళలకు అవగాహన కల్పించారు. చేతులను సబ్బునీటితో కడుక్కోవాలని, మలమూత్ర విసర్జనకు వెళ్లిన ప్రతిసారి కాళ్లు, చేతులు నీటితో కడుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఆయా ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు BLVCETకి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 21న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



కత్తేపల్లి ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: నియోజకవర్గంలోని ఆలయాలు ఎంతో ప్రసిద్ధి గాంచినవని, ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని కత్తేపల్లి వీరభద్రస్వామి ఆలయంలో శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ సిద్ధిరామాపండితారాధ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సనాతనధర్మ జాగృతి ధార్మిక సమ్మేళనంలో సిద్ధిరామాపండితారాధ్య భక్తులకు సందేశమిచ్చారు. హిందువులు ప్రతినిత్యం ఆలయాలకు వెళ్లి పూజలు చేయాలని సూచించారు. ఈసందర్భంగా పీఠాధిపతితో పాటు ఎమ్మెల్యేను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంటు చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, ఎస్టీడీశ్రీను, భక్తులు పాల్గొన్నారు.

ప్రార్థనాలయాలు శాంతికి చిహ్నాలు

ప్రార్థనాలాయాలు శాంతికి చిహ్నాలని, ప్రతి ఒక్కరూ నిత్యం సమయం కేటాయించి ప్రార్థనాలయాలకు వెళ్లాలని ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి, కేశం నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఎంబీ యేరుషలేం చర్చిని సందర్శించారు. ప్రతిఒక్కరూ దైవనిబంధనలను పాటిస్తూ ప్రేమానురాగాలతో కలిసి జీవించాలని, ప్రభువు ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ఖానపూర్‌కు చెందిన చంద్రశేఖర్‌గౌడ్ పీహెచ్‌డీ పూర్తిచేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందడంతో ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, శ్రీను, రవీందర్, బాబు, మహేందర్‌రెడ్డి, అజ్మతుల్లా, నాగేష్, షంషీర్, గోపాల్, రాజు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని, వారిని కాపాడుకునేందుకు ప్రతి నిత్యం శ్రమిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని కత్తేపల్లికి చెందిన సీనియర్ నాయకుడు రాజు భార్య సరోజ ఇటివలే తీవ్ర అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ వారి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి అయిన ఖర్చులను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అమరచింత: పట్టణానికి చెందిన ఈడ్గి వల్లభదాస్ కిష్టమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. కిష్టమ్మ మరణ వార్త తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం కిష్టమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ తల్లి కిష్టమ్మ మృతికి వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

కొత్తకోట రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు 120వ జయంతిని కొత్తకోట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని, భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పొట్టిశ్రీరాములు అవార్డు గ్రహీత బాదం వెంకటేశ్వర్లు, విశ్వనాథం వెంకటరమణ, భీమ బాలకృష్ణ, భీమ కిషోర్, కొండ శ్రీను, గుంత సురేష్, సతీష్, నరేష్, కిరణ్, బస్వరాజ్, బాలీశ్వర్, కిషోర్, శ్రీనివాసులు, రమేష్, శ్రీరాములు, వాసుదేవయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెబ్బేర్ రూరల్: వనపర్తి మండలంలోని కాశీంనగర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు బండారి చిన్నరాములు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వనపర్తి యువ నాయకుడు సాయిప్రసాద్‌యాదవ్ శనివారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రేవల్లి రాములు, వినోద్‌కుమార్, సాయికిరణ్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం



అమరచింతలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న కౌన్సిలర్లు

అమరచింత: గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు నాగరాజు కుటుంబానికి తమ వంతు అండగా ఉంటూ సహకారం అందిస్తామని మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. పట్టణానికి చెందిన నాగరాజ్ మున్సిపల్‌లో చెత్త తరలించే ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా విధులు నిర్వహించే నాగరాజు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరం అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం కౌన్సిలర్లు మంగ లావణ్య, మాధవి, సింధు, ఉషారాణి పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. మున్సిపాలిటీ నుంచి అందాల్సిన పరిహారం త్వరగా అందేటట్లు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

రాజీ మార్గమే రాజమార్గం



కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శిరీష

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శిరీష మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశానికి లోనై కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టు తిరగడం వల్ల ఎంతో విలువైన సమయం వృథా అవుతుందని వివరించారు. వివిధ రకాల క్రిమినల్ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, ఇతర పోలీస్ కేసుల ద్వారా రూ. 3.23 లక్షల జరిమానాలు విధించగా.. మొత్తం 658 కేసులను పరిష్కరించి కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు వై తిప్పారెడ్డి, జీకే రాములు, న్యాయవాదులు నారాయణగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, దివాన్జీ అశోక్‌కుమార్, గంగాధర్‌గౌడ్, బీవీ రత్నం, విజయభాస్కర్‌రెడ్డి, ముక్తేశ్వర్, ఏపీ రాజేందర్, కృష్ణ, కిషోర్, విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, అబ్రహం, మన్యం, వినోద్, వర్కటం శ్రీనివాస్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది రూప, రాణి, విద్యావతి ఆయా మండలాల పోలీసు సిబ్బంది ఉన్నారు.

రామన్‌పాడులో 1,013 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. బుధవారం 1,013అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊకచెట్టువాగు వంతెన కింద నీటిమట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వార వచ్చే నీటిని నిలిపి వేశారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

18న తైబజారు వేలం

చిన్నంబావి: ఈనెల 18వ తేదీన తైబజారు వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వసంత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది 8 నెలలకు గాను రూ.96వేలకు టెండర్ దక్కించుకున్నారని, ఈ సారి వేలం రూ.రెండు లక్షల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఈ నెల 18వ తేదీన ఉదయం పది గంటలకు చిన్నంబావి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్దకు రావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తకోట రూరల్: పట్టణంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎడ్ల బండ్లతో ఇసుకను కొందరు డంప్ చేయగా.. ఆ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పట్టణంలో కొందరు ట్రాక్టర్ల యజమానులు అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారే సమాచారంతో దాడులు నిర్వహించి అనుమతి పత్రాలు లేని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇసుక, మట్టి అనుమతి లేకుండా తరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో గల మహాలక్ష్మి క్లీనిక్‌లో ఉండే డాక్టర్లకు వ్యక్తిగతంగా ఉండే డాక్టర్ స్పెషలైజేషన్ లెటర్ ప్యాడ్ లేని కారణంగా ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో గల ప్రైవేట్ ఆస్పత్రుల్లో అన్ని అనుమతులు ఉండాలని, లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సహచట్టం చార్ట్‌పై అధికారుల పేర్లు ఎక్కడ?



అమరచింత: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహచట్టం సూచిక బోర్డుపై అధికారుల పేర్లను రాసి ఉంచకపోవడంతో కార్యాలయంలో ఉన్నతాధికారి ఎవరో.. సమాచారం ఎవరిని అడగాలో అర్థం కావడం లేదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 2005లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు అడిగిన సమాచారం ఇచ్చేందుకు వీలుగా సహచట్టంను అమలులోకి తీసుకొచ్చింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సూచిక బోర్డులలో సైతం అధికారుల పేర్లు కనుమరుగవుతున్నాయి.

టీకాల పంపిణీ వందశాతం పూర్తిచేయాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పరిమళ



రాయినిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డా.పరిమళ

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో టీకాలు పంపిణీ చేసి వారిని వ్యాధుల బారి నుంచి కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పరిమళ అన్నారు. శనివారం మండలంలోని దొండాయిపల్లి, రాయినిపల్లిలో పర్యటించి వ్యాధి నిరోధక టీకాల పంపిణీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీకాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సకాలంలో వేయించేలా చూడాలన్నారు. చిన్నారుల జాబితాను అందుబాటులో ఉంచుకొని ఉదయం సమయంలో టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. టీకాలు వేసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. టీకాల పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు యూవిన్ పోర్టల్‌లో పొందుపర్చాలని చెప్పారు. పంపిణీలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బాలచంద్రయ్య, బుడ్డమ్మ, నిర్మల, కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాలికలను ఎదగనివ్వాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, తల్లిదండ్రులు

గోపాల్‌పేట: బాలికలను చదవనివ్వడమే కాకుండా ఎదగనివ్వడం వల్ల దేశానికే నిర్దేశకులుగా మారతారని బేటీ బచావో బేటీ పడావో జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని తాడిపర్తిలో మహిళా శిశుసంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ భేదం లేకుండా పిల్లలను పెంచాలని కోరారు. ప్రభుత్వం బాలికలకు ప్రత్యేక విద్యాలయాలను స్థాపించి విద్య, ఆరోగ్యం, వసతి తగిన సౌకర్యాలు కల్పిస్తుందని గుర్తించారు. పిల్లలకు చిన్న వయసులోనే పెళ్లి చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు చోటుచేసుకుంటాయని వివరించారు. కార్యక్రమంలో జండర్ స్పెషలిస్టు శ్రీవాణి, సలోమి, స్పెషలిస్టు ఇన్ ఫైనల్ లిటరస్ సుమ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



బయలుదేరుతున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రకు ఖిల్లాఘనపురం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తుండటంతో ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ మాట్లాడుతు త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ మూడో సారి అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. సభకు

పోషక పదార్థాలతో ఎంతో ప్రయోజనం



వీపనగండ్లలో వంటల తయారీపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అమరచింత: పోషక పదార్థాలను భోజన సమయంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో కలుగుతున్నాయని సీడీపీఓ భారతి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం పోషణ వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ లబ్ధిదారులకు పోషక విలువల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, ప్రసూతి, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెబ్బేర్ రూరల్: పెబ్బేర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం రిటైర్డు టీచర్ రామచందర్ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, వార్డు అధికారి సునీత, టీచర్ బుసిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, ప్రేమలత, స్వర్ణలత, రాధ, ఆశా కార్యకర్తలు ఇందిరమ్మ, సరళ, చెన్నమ్మ పాల్గొన్నారు.

వంటల తయారీపై అవగాహన

వీపనగండ్ల: ఐసీడీఎస్ ద్వారా నిర్వహిస్తున్న పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో వంటల తయారీపై అంగన్‌వాడీ టీచర్లు యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, సువర్ణ, మహేశ్వరి, హెల్పర్లు ఈశ్వరమ్మ, లక్ష్మమ్మ పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై నిరసన



గోపాల్‌పేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం కొత్తకోట చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా శని, ఆదివారం కోర్టుకు సెలవు ఉంటుందని తెలిసి పథకం ప్రకారమే అరెస్టు చేశారని దుయ్యబట్టారు. ఇది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర అన్నారు. బీజేపీ నాయకులు కొంతకాలంగా కవితను అరెస్టు చేస్తామని ఈడీ అధికారుల మాదిరిగా చెప్పుకుంటూ వచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, ఆకుల శ్రీను, విశ్వేశ్వర్, బాబురెడ్డి, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, భాస్కర్, బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వినోద్‌సాగర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో..

గోపాల్‌పేట: అధికారం అడ్డంపెట్టుకుని బీజేపీ రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ మండల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం వారు మండల కేంద్రంలోని బస్టాండులో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడీని అడ్డం పెట్టుకుని కేంద్రం రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, తిరుపతియాదవ్, బాల్‌రాజు, మతీన్, బిల్ల కంటిరాజు, మణ్యంనాయక్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కొనసాగుతుంది. శనివారం మండలంలోని కేతేపల్లి, మంగళ్లపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. శరీరంపై మొద్దుబారిన స్పర్శలేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు తెమడపడటం, రక్తం పడటం, స్వల్పకాలంలో బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో రోజు విడిచి రోజు జ్వరం రావడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు టీబీ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న వారు వైద్యాధికారిని సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో టీవీ చోరీ



బండపల్లి ప్రాథమిక పాఠశాల తలుపుల తాళం పగులగొట్టిన దుండగులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్న టీవీని దొంగలు తీసుకెళ్లారని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రినిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాల భవనం తెరిచేందుకు రాగా అప్పటికే పాఠశాల తలుపు తాళం పగిలిపోయి కనింపించిందని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న రూ.15వేల విలువ గల బీపీఎస్ స్మార్ట్ టీవీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. బీరువా తాళం సైతం పగులగొట్టి కాగితాలు ఎక్కడపడితే అక్కడ పడేశారన్నారు. ఈవిషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పాఠశాల సిబ్బంది తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ద్విచక్రవాహనం..

పాఠశాలలో టీవీ చోరీ చేసిన కాలనీలోనే శనివారం కొమ్ము రామస్వామి అనే వ్యక్తి తన ఇంటి ఎదుట ద్విచక్రవాహనం నిలిపి రాత్రి నిద్రపోయాడు. మధ్యరాత్రి రెండు గంటల ప్రాంతంలో లేచి చూడగా బైకు ఉందని, తెల్లవారిన తర్వాత చూస్తే తన ద్విచక్రవాహనం కనిపించలేదని వాపోయారు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో శనివారం సాయంత్రం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు గిరమ్మతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, సంస్థాగతంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యశీలారెడ్డి, వెంకట్రామిరెడ్డి, గంధ రాజశేఖర్, మధుసూదన్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.

